## క్లుప్తంగా

### ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

**నరసన్నపేట:** స్థానిక దేశవానిపేటలోని బీసీ బాలికల వసతి గృహానికి నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఏడు టేబుల్ ఫ్యాన్లను వితరణ చేశారు. శివనగర్ వీధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో వసతి గృహ విద్యార్థులు వచ్చి గదుల్లో ఫ్యాన్లు లేక పోవడంతో ఉక్కపోతకు గురి అవుతున్నామని, కలెక్టర్‌తో మాట్లాడి అదనంగా ఫ్యాన్లు మంజూరుచేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ ప్రక్రియ అంతా అయ్యేసరికి ఆలస్యం అవుతుందని, అంతవరకు విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని భావించి తానే స్వయంగా డబ్బు వెచ్చించి 7 టేబుల్ ఫ్యాన్లను ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వైశ్యరాజు కేశవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పాగోటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

### వృత్తిపట్ల అంకితభావం అవసరం



అధ్యాపకుడిని సన్మానిస్తున్న దృశ్యం

**సరుబుజ్జిలి:** వృత్తిపట్ల అంకితభావం ఉంటే సమాజంలో మంచి గౌరవం ఉంటుందని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు జి.వి.శివానందమూర్తి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా విధులు నిర్వహించి, బదిలీపై వెళ్లిన రాంప్రసాద్, ధనుంజయరావు, చిన్నారావును బుధవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు మాట్లాడుతూ వృత్తినే దైవంగా పనిచేసినప్పుడే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



వైఎస్సార్ బీమా అందజేస్తున్న సర్పంచ్ కృష్ణ

**సరుబుజ్జిలి:** మండలంలోని రావివలస గ్రామానికి చెందిన అదపాక గోవిందరావు ఇటీవల మృతి చెందారు. మృతుని భార్య ఈశ్వరమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేలను సర్పంచ్ వండాన కృష్ణ బుధవారం అందజేశారు. మాజీ సర్పంచ్ బొంగు వెంకటరమణ, బొంగు శ్రీను, వెల్ఫేర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్ ఉన్నారు.

### పశువ్యాధులపై అప్రమత్తం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ ఆనందరావు

**ఆమదాలవలస రూరల్:** పశువులకు సక్రమించే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీఏ ఆర్.ఆనందరావు తెలిపారు. మండలంలో తొగరాం గ్రామంలో గల రైతు భరోసా కేంద్రంలో బుధవారం పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పాడి–పంటతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించుకోవచ్చునని తెలిపారు. వర్షాకాలంలో పశువులకు పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున ముందస్తుగా టీకాలు వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, డిప్లొమా విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు నరసన్నపేటలో గడపగడపకు మన ప్రభుత్వం

**నరసన్నపేట:** మండల కేంద్రంలోని బొడ్డవలసలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు పాల్గొనాలని కోరారు.

### 'తెలుగు భాష మాధుర్యాన్ని తెలుసుకోవాలి

**శ్రీకాకుళం అర్బన్:** రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గిడుగు రామ్మూర్తి జయంతి వారోత్సవాలను స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్లో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ దేవదత్తానంద్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. తెలుగు భాష మాధుర్యాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి చేసిన సేవలను వివరించారు. తెలుగు సహాయకులు చాడ శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు వాడాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి విశేష స్పందన



నరసన్నపేట: దేశవానిపేటలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

**నరసన్నపేట:** అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేటలోని దేశవానిపేట, వజ్రంపేట, నక్కవీధుల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియచేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో అయితే జన్మభూమి కమిటీలదే ఇష్టారాజ్యమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే టీడీపీ జెండా మోయించారన్నారు. ఇప్పుడు రాజకీయాలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్నామని, అర్హత కలిగిన టీడీపీ వారికి పథకాలు అందుతున్నాయని, గడపగడపకు తిరుగుతున్నప్పుడు వారికి పథకాలు అందుతున్నాయనేది స్పష్టం అవుతుందన్నారు. ఇటువంటి పాలన దేశంలోనే ఆదర్శమన్నారు. ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను గమనించి మళ్లీ ఆదరించాలని కోరారు. నిరుద్యోగం, పరిశ్రమలు, ప్రాజెక్టులు, ఇళ్ల పట్టాల పంపిణీ, మూడు రాజధానులు ఇలా ప్రతీ అంశంపై టీడీపీ విమర్శలు చేస్తుందని, వీటిని ప్రజలు గమనించాలని కోరారు. టీడీపీ విమర్శలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, పార్టీ నాయకులు చింతు రామారావు, గుప్త, రాజాపు అప్పన్న, రావాడ మోహన్‌రావు, వండాన లక్ష్మణరావు, ఇట్రాజు సూరిబాబు, పట్ట టాగూర్, చింతు అప్పారావు, ఇట్రాజు రామారావు, నర్సింహులు, పట్ట శ్రీను, గొల్లంగా బాలరాజు, చిన్నప్పన్న తదితరులు పాల్గొన్నారు.

**ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు..**

**ఎల్.ఎన్.పేట (పాతపట్నం):** ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత అర్హత కలిగిన లబ్ధిదారుల ఇంటి వద్దకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం మండలంలోని గంగువాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆయా పథకాలతో లబ్ధిదారులు పొందిన ఆర్థిక ప్రయోజనాలపై అవగాహన కలిగించారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన తరువాత ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హత కలిగిన లబ్ధిదారుల ఎంపికతోపాటు పథకాలను ఇంటి వద్దకే వెళ్లి అందించేలా వలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఒకప్పుడు పథకాల కోసం నాయకులు, మండల, జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, నేడు సీఎం జగనన్న పాలనలో ఆ పరిస్థితి లేదన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు ఇంటి వద్దకే సరఫరా చేస్తున్నారని వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చి ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్నామన్నారు. అన్ని వర్గాల వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లోను గెలిపించాలని ప్రజలను కోరారు. టీడీపీ నాయకులు గ్రామాలకు వచ్చి మాయమాటలు చెబుతున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు అందరినీ మోసం చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బి.నారాయణమూర్తి, ఢిల్లీశ్వరావు, శ్రీనివాసరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: పాతపట్నం మండలం గంగువాడలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

# విద్యుత్‌శాఖ పనితీరుపై అసంతృప్తి

- ఇళ్లపై నుంచి ఉన్న విద్యుత్ వైర్లు ఉన్నా పట్టించుకోవడంలేదు
- మండల సమావేశంలో సభ్యుల ఆందోళన



విద్యుత్ శాఖ ఏఈ వెంకటేష్‌ను నిలదీస్తున్న సభ్యులు

**ఎల్.ఎన్.పేట:** మండలంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల పనితీరు రోజురోజుకు దిగజారిపోతుందని, మీ పనితీరువల్ల ప్రజల్లో ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు చెడ్డపేరు వస్తుందని మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, కోఆప్షన్ సభ్యుడు రామ్‌నాథ్ పాణిగ్రాహి, తురకపేట సర్పంచ్ మొదలవలస యోగీశ్వరి ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో 40 ఇళ్ల పైనుంచి విద్యుత్ వైర్లు ఉన్నాయని, వైర్లు మార్చాలని ఏడాదిగా చెపుతున్నా పట్టించుకోవటం లేదని విద్యుత్ శాఖ ఏఈ రాజశేఖర్‌ను పలువురు సభ్యులు నిలదీశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ చెప్పినా ఎందుకు వినడం లేదన్నారు. గ్రామ సచివాలయ విద్యుత్ ఉద్యోగులు (జెఎల్‌ఎం)లు ఎవరి పరిధిలో పనిచేస్తారని తురకపేట సర్పంచ్ మొదలవలస యోగీశ్వరి ప్రశ్నించారు. విద్యుత్ శాఖ పరిధిలో ఉంటారా? మండల పరిషత్ పరిధిలో ఉంటారా? తెలియజేయాలని నిలదీశారు. వీధి దీపాలు వేసేందుకు కూడా సహకరించటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మీకు సక్రమంగా పనిచేయటం ఇష్టం లేకుంటే సెలవుపెట్టి వెళ్లిపోతే మరో ఉద్యోగిని తెచ్చి పనులు చేయించుకుంటామన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం నిరుపయోగంగా మిగిలిపోయిందని, కుళాయిలు ఏర్పాటు చేసి సంవత్సరాలు కావస్తున్నా చుక్క నీరు రావటం లేదని యంబరాం, చింతలబడవంజ, కోవిలాం, తురకపేట, ముంగెన్నపాడు సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని పలువురు సభ్యులు కోరారు. ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లించటం జరిగిందని ఏఈ రమేష్ తెలిపారు. సాగునీటి చెరువుల మదుములు రిపేర్లు, కొత్త మదుములు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని యంబరాం సర్పంచ్ వెలమల గోవిందరావు కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, వైస్ ఎంపీపీ శివ్వాల ఇందమ్మ, ఎంపీడీఓ ఆర్ కాశీప్రసాద్, ఏఓ పైడి లతశ్రీ, వెటర్నరీ డాక్టర్ జి.కవిత, తురకపేట, లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు లక్ష్మీదీప్, పి.ప్రియాంక, ఐసీడీఎస్ సీడీపీఓ యు.విమలకుమారి, ఎంఈఓలు మణికుమార్, చంద్రమౌళి, ఉపాధి ఏపీఓ వి.శ్రీదేవి, ఎంపీటీసీలు పల్లి జయలక్ష్మి, మూకళ్ల తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా ఓటర్ సర్వే విజయవంతం



రాజకీయ పార్టీల నాయకులతో చర్చిస్తున్న ఆర్డీఓ శాంతి

**ఆమదాలవలస రూరల్:** ఇంటింటా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఓటర్ సర్వే విజయవంతంగా పూర్తిచేసినట్లు ఆర్డీఓ, అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి బి.శాంతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు సర్వే 99 శాతం పూర్తిచేయడంతో రాజకీయ పార్టీల నాయకులకు, సంబంధిత అధికార యంత్రాంగానికి అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గంలో జరిగిన ఇంటింటా ఓటర్ సర్వే కార్యక్రమంలో మొత్తం 1,86,621 ఓట్లు ఉండగా 1,84,454 ఓటర్లను పరిశీలన చేసినట్లు తెలిపారు. అందులో 2633 మంది ఓటర్లు గైర్హాజరు కాగా.. 1253 మంది ఓటర్లు మృతి చెందారన్నారు. కొత్తగా ఓటు హక్కు నమోదు కోసం 2452 మంది, తొలగింపు కోసం 1151, మార్పుల కోసం 4957 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు వెల్లడించారు. ఓటు హక్కు నమోదు కోసం అర్హత గల యువతీ, యువకులు నిరంతరం దరఖాస్తులు చేసుకోవచ్చునని సూచించారు. వివరాలు లేని ఓటర్ల జాబితాను తయారుచేసి సంబంధిత పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంచి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లు జాబితాలో నమోదైన చిరునామాకు నోటీసులు పంపడం జరుగుతుందన్నారు. నోటీసు అందించిన 15 రోజుల్లో వివరణ అందించాలని, లేకుంటే ఓటు హక్కును తొలగించడం జరుగుతుందన్నారు. ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ తహసీల్దార్లు ఎస్.గణపతిరావు, బి.రమేష్‌కుమార్, ఎస్.రమణారావు, పొందూరు మండల డీటీ వెంకటేశ్వరరావు, ఎలక్షన్ డీటీ మురళీధర్‌నాయక్ పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఆర్‌డీఏ పీడీ డి.విద్యాసాగర్



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

**బూర్జ:** విధి నిర్వహణలో వైఎస్సార్ క్రాంతి పథకం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని డీఆర్‌డీఏ పీడీ డి.విద్యాసాగర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల ఏపీఎంల ఆధ్వర్యంలో నెలవారీ సమీక్ష నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ అన్ని సంఘాలూ ఏ–గ్రేడ్‌లో ఉండేలా కృషి చేయాలన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేలా అవగాహన కల్పించాలన్నారు. చిరుధాన్యాలు వినియోగించుకునేలా ప్రతీ కుటుంబానికి వివరించాలన్నారు. ఈ మూడు మండలాల్లో చిరుధాన్యాలు ఎంత విస్తీర్ణంలో పండిస్తున్నారని, అలాగే బ్యాంకు లింకేజీల గురించి అడిగి తెలుసుకున్నారు. జనరల్ ఫండ్, హెచ్‌డీ ఎంతవరకు కలక్షన్ చేశారన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు అధిగమించాలన్నారు. ఏపీడీ బి.నారాయణరావు, డీపీఎం బి.మోహన్‌రావు, డీపీఎం రామ్మోహన్‌రావు, బ్యాంక్ లింకేజీ డీపీఎం ఎ.నాగలక్ష్మి, స్త్రీనిధి ఏజీ బి.సత్యనారాయణ, ఎంఎంఎస్ అధ్యక్షుడు బొడ్డేపల్లి రమణమ్మ, ఎ.కల్యాణి, ఏపీఎంలు పి.భాస్కరరావు, కమలకుమారి పాండ్యన్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీలకు మెడికల్ కిట్లు



ప్రాజెక్టు కార్యాలయంలో భద్రపర్చిన మెడికల్ కిట్లు

**సారవకోట:** మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాలకు మెడికల్ కిట్లు సరఫరా అయినట్లు సూపర్‌వైజర్ సుజాత బుధవారం తెలిపారు. సారవకోట, జలుమూరు మండలాల్లో గల 193 అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ మెడికల్ కిట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కిట్లు ఏపీఎంఎస్ఐడీసీ నుంచి సరఫరా అయినట్లు తెలిపారు.

# ఉపాధ్యాయుడిని బదిలీ చేయవద్దు



ఎంఈఓలతో మాట్లాడుతున్న పెద్దపద్మాపురం గ్రామస్తులు

**మెళియాపుట్టి:** విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుని ఉపాధ్యాయులను వేరే పాఠశాలకు బదిలీ చేసే ప్రక్రియలో భాగంగా.. మండలంలోని పెద్దపద్మాపురం గ్రామంలోని ఎంపియూపీ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడ్ని బదిలీ చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. వారు బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో ఎంఈఓలు దేవేంద్రరావు, పద్మనాభంను కలిశారు. పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారని, ఒకరిని బదిలీ చేయడంతో విద్యాప్రమాణాలు దెబ్బతింటాయన్నారు. బదిలీ ప్రక్రియ నిలిపివేయాలని కోరారు. ఎంఈఓ దేవేందరరావు స్పందిస్తూ.. దానికి సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు రాలేదని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన ఉర్లాన రుషి, మాలతి శ్రీధర్, జీవరత్నం, రుక్మాంగధరరావు తదితరులు ఉన్నారు.

# టంగుటూరి సేవలు చిరస్మరణీయం

టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయమని అధికారులు, ప్రజా ప్రతినిధులు అన్నారు. టంగుటూరి జయంతిని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో బుధవారం నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. 1953లో ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనత టంగుటూరికే దక్కుతుందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: టంగుటూరి చిత్రపటానికి పూలమాలవేస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిసుధాకర్, సిబ్బంది



జలుమూరు: ఎంపీడీఓ కార్యాలంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ గోపి, అధికారులు



ఆమదాలవలస రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ వాసుదేవరావు, సిబ్బంది



పొందూరు: ఎంపీడీఓ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ కిల్లి ఉషారాణి, అధికారులు, నాయకులు

# పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



పుస్తకాలతో ఎంఈఓ శ్రీధర్, విద్యార్థులు, తదితరులు

**పాతపట్నం:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎంఈఓ-1 బి.శ్రీధర్ పిలుపునిచ్చారు. పాతపట్నం మేజర్ పంచాయతీ పిల్లివీధి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం గ్రంథాలయ పుస్తకాల పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఎంతగానో ఆకట్టుకుని, ఉపయోగపడే రూ.20 వేలు విలువ చేసే అనేక రకాల పుస్తకాలను ప్రకాశం గ్లోబల్ ఎన్నారై ఫ్రమ్ (పిజిఎన్ఎఫ్), లెర్న్ అండ్ హెల్ప్ సంస్థలు సంయుక్తంగా అనేక రకాల ఆసక్తికరమైన పుస్తకాలను పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పెద్దలు సిర్ల జోగారావు, మేజర్ పంచాయతీ వైస్ సర్పంచ్ దువ్వారి మమత, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లోలుక కమలకుమారి, పాఠశాల హెచ్ఎం గూనాపు శార్వాణి, సంస్థ ప్రతినిధులు జాస్తి శివరామకృష్ణ, మాల్యాద్రి, సీఏ ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు ఎం.ఢిల్లేశ్వరావు, టి.ధనుంజయరావు, సీఆర్పీ సూర్యం, సుభాష్, పాఠశాల స్థలదాత ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రయాన్ సంబరాలు



నరసన్నపేట: జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య, తదితరులు

**నరసన్నపేట:** చంద్రయాన్–3 విజయవంతంలో భాగస్వామ్యమైన ప్రతీఒక్క శాస్త్రవేత్త కూడా మనకు హీరో అని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి జాతీయ జెండాను బుధవారం ప్రదర్శించారు. శాస్త్ర వేత్తలకు అభినందనలు తెలిపారు. శాస్త్ర, సంకేతిక, భౌగోళిక, అంతరిక్ష రంగాల్లో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్, జేసీఎస్ కన్వీనర్ సురంగి నర్సింగరావు, నాయకులు గుప్త, రాజాపు అప్పన్న, వైశ్యరాజు కేశవరాజు, బీఎల్ శర్మ, గనగళ్ల శ్రీను, బుద్దల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**విజయోత్సవ ర్యాలీ**

**పాతపట్నం:** పాతపట్నం మండల కేంద్రంలో చంద్రయాన్–3 విజయోత్సవ ర్యాలీని వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జాతీయ జెండాలను చేతపట్టి పాతపట్నం వీధుల్లో యువకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

**ఎల్.ఎన్.పేటలో..**

**ఎల్.ఎన్.పేట:** మండలంలోని తురకపేట సెంటర్‌లో ఉన్న ఎస్.వి.స్కూల్ విద్యార్థులు, ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ సభ్యులు జయహో చంద్రయాన్ అంటూ నినాదాలు చేశారు. చంద్రయాన్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డి.సుజాత పాల్గొన్నారు.





ఎల్.ఎన్.పేట: జయహో చంద్రయాన్ అంటున్న విద్యార్థులు

### • భారీ వర్షం



కురుస్తున్న వర్షం

**ఎల్.ఎన్.పేట:** మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం కుండపోతగా వర్షం కురిసింది. గతకొన్ని రోజులుగా వర్షాల్లేకపోవటంతో రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్న సమయంలో కుండపోతగా వర్షం కురవటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ వేడితో అల్లాడిన జనాలకు సాయంత్రం కురిసిన వర్షం కాస్త ఊరటనిచ్చింది. మేఘాలు కమ్మేసి ఒక్కసారిగా వర్షం కురవటంతో అన్ని వర్గాల వారికి ఉపశమనం లభించింది. మెట్టు ప్రాంతాల్లోని పంటలకు జీవం పోసినట్లు అయిందని రైతులు చెబుతున్నారు.